



"అమ్మా! అమ్మా!" పిలిచింది ఐదేళ్ళ పసిపాప.

"వస్తున్నానమ్మా!" అంటూనే వచ్చేసింది అమ్మ.

"నేను బడి నుంచి వచ్చేశానమ్మా! నువ్వెక్కడున్నావ్?" వాకిట్లో కన్పించ లేదేం?" బుంగమూతితో ప్రశ్నించిందిపాప.

"ఇప్పటివరకూ నీ కోసమే చూశానమ్మా! ఇప్పుడే ప్రక్కింటి పిన్నిగారు పిలిస్తే పెరట్లోకి వెళ్ళి, వస్తున్నాను."

"ఎవరు పిలిచినా సరే, ఎన్ని పనులున్నా సరే, నే నొచ్చేసరికి వాకిట్లోనే కన్పించాలి. సరేనా అమ్మా!" ముద్దుగా అంది పాప.

"అలాగే, నువ్వు డ్రెస్ మార్చుకోమ్మా! టిఫిన్ తెస్తాను." పాప తల నిమురుతూ అందామె.

"ఏం టిఫిన్ చేశావమ్మా?" మరో ప్రశ్న వేసింది పాప.

"నీ కిష్టమైన బ్రెడ్ దోసె చేశానమ్మా! తెస్తానుండు," అంటూ లోపలికెళ్ళింది అమ్మ. మరుక్షణం, టిఫిన్‌తో తిరిగి వచ్చింది.

"నే తినిపిస్తాను, ఒళ్ళో కూర్చోమ్మా!" ప్రేమగా అంది అమ్మ.

"సరే. నంటూ అమ్మ ఒళ్ళో కూర్చుంది పాప. పాప నోట్లో టిఫిన్ పెట్టబోయిందామె. ఇంతలో ఏ పెద్ద సుడిగాలి అశని పాతంలా వీచింది. అంతే. పాపకనిపించడం లేదు, అమ్మకు. ఎటు పోయింది పాప?

ఆమె కంగారు పడుతోంది.

"పాపా! పాపా!" ఆమెగొంతు ఆర్ద్రమౌతోంది. ఇంకా బిగ్గరగా పిలుస్తోంది.

"పాపా! ఎక్కడున్నావమ్మా! పాపా, పాపా!"

* * *

"రేఖా, రేఖా! ఏమిటి కలవరిస్తున్నావ్!" ఆ మాటలకు మెల్లగా కళ్ళు తెరచింది సురేఖ. ఎదురుగా భర్తను చూసి.

"ఇప్పటివరకు నేను చూసింది కలన్నమాట!" అనుకుంది సురేఖ అయినా ఇంకా నమ్మకం కలుగలేదు. చుట్టు కలయజూసింది.

"హమ్మయ్య! నేను చూసింది కలే." అని నిర్ధారణ చేసుకుంది.

"ఏమిటి రేఖా! కలేదైనా వచ్చిందా?" అన్నాడు రాఘవ్ ఆమె పరిస్థితిని ఊహిస్తూ.

"అవునండీ! కలే వచ్చింది. మంచి కలే నండీ! కాని. ఆఖర్న పాప అదృశ్యమై పోయింది. నా కెంత గాభరా వేసిం దనుకున్నారు!" అంది సురేఖ ఇంకా తన కలలోని అనుభవాన్ని తలచుకొంటూ.

"భలేదానివే. కలకేనా ఇంత భయం! లేవోయ్. తెల్లవారిపోయింది. ఇవాళ ఆఫీసుకు త్వరగా వెళ్ళాలి. లే. త్వరి."

రాఘవ్ చేయి పట్టుకొని మెల్లిగా లేచింది సురేఖ.

"ఇంకా పోలేదా నీ భయం." నవ్వుతూ న్నాడు రాఘవ్.

"నాకెం భయం లేదు" అంది ధైర్యాన్ని కూడగట్టుకుంటూ సురేఖ

కుదుటబడ్డ మనసుతో కార్యరంగంలో ప్రవేశించింది సురేఖ. అలవాటులో అలజడి చెందినమనసును మభ్యపెట్టడానికా అన్నట్లు.

* * *

"ఇక చెప్పవోయ్. నీ కలా విశేషం ఏమిటో!" అన్నాడు ఆఫీసు నుంచి రాగానే రాఘవ్.

"నా కలకేం తొందర. ముందు టిఫిన్ కానివ్వండి." అంది సురేఖ టిఫిన్ ప్లేట్ అందిస్తూ.

అమ్మమ్మ! ఎంత మాత్రం వీల్లేదు. నా మిసెస్‌ను, ఐ మీన్ నా సతీమణి సురేఖాదేవి గార్ని అంతగా భయపెట్టి, కలవరపరచిన ఆ కలను ఆసాంతము తెలుసుకోననిదే నేను ఏ పదార్థమూ సేవించక, నిరాహారదీక్షగావించెదను. ఈ ఆలస్యమును భరింపజాలను. తక్షణమే వినిపించుదేవీ!" అన్నాడు రాఘవ్. కొంత హాస్యం, మరికొంత ఉత్సాహం మేళవించిన స్వరంతో.

"పోనీ నేను కల చెబుతూ ఉంటా. మీరు టిఫిన్ తినుకుంటూ వినండి."

"సరే, ఈ సంధికి ఒప్పుకొనుచున్నాను. ఇక ప్రారంభించు" అంటూ టిఫిన్ కుపక్రమించాడు.

తను చూసిన కల మొత్తం తు. చ. తప్పకఅప్పచెప్పింది, కంఠస్థంచేసిన పద్యం అప్పజెప్పిన విద్యార్థిలా.

"కలలో పాప అలా అదృశ్యం కావడం నాకేదో అపశకునంగా తోస్తుందండీ!"

"ముద్దాయి స్టేట్‌మెంట్ పరిశీలించడమైనది. కాని ఈ కేసు కొట్టివేయుడమైనది. ఎందుకనగా .. ఎందుకని అడగవేం!" అన్నాడు రాఘవ్ కోర్టు భాషలో.

"ఎందుకడగాలి? లాయర్‌గారే చెప్పాలి. ఏ కోడ్ నంబర్, ఏ సెక్షన్ ప్రకారం కొట్టివేయబడిందో?" అంది సురేఖ తనూ రాఘవ్ ననుసరిస్తూ.

"మా ఉద్దేశాన పాపను తమకు కాదే పుట్టవలసి యున్నది. కాని, కలలో పాప కన్పించినందున, కేసే లేదు. కాన, ఈ కేసును కొట్టివేయడమైనది."

"పాప పుడితే ఏం చేస్తారో?"

"పాప పుడితే, అది మీ డిపార్టుమెంటు కాబట్టి, మనకేమి సంబంధం లేదు."

"ఓహో! అట్లాగయితే, బాబు పుడితే మీ డిపార్టుమెంటు కనుక, అన్ని పనులు మీరే చూసుకోవాలి. నా కేమీ సంబంధముండదు. అగ్రీడ్?" అంది సురేఖ, క్రాస్ ఎగ్జామినేషన్ చేసే పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లా.

"అబ్జక్షన్ యువరానర్! అసలు పిల్లల్ని కనడం, పెంచడం వగైరాలు మా కార్యక్రమాల జాబితాలో లేనందున. ఎవ్వరు

పట్టిసను. ఎట్టి అభ్యంతరమూ తెలుపక, యథారీతి సభలందు ధారమును పోయుదును." అన్నాడు రాఘవ్ కోర్టులోనే వాదిస్తున్నంత ఆవేశంగా.

"అలా దారికి రండి." నవ్వుతూ అంది సురేఖ.

"ఎప్పుడు మాత్రం దారికి రాకుండా వదిలారు గనుక ?" కాఫీ అందుకొన్నాడు రాఘవ్ తనూ నవ్వుతూ.

"ఆఁ.... రేఖా ! అలా షికారు వెళ్లాం పద ! వాకింగ్ ఆరోగ్యానికి చాలా మంచిది."

"ఓహో అలాగా ! మీరు ఏ డాక్టర్ సలహా తీసుకున్నారోగాని, అవన్నీ పాటించలేక మధ్యలో నేను ఇదౌతున్నాను."

"మరి ఎన్నో కష్టాలు పడితేగాని బంగారం లాంటి బాబు రాడు."

"ఉహూఁ.... పోండి !"

"అగ్రీడ్"

"అయితే ఇప్పుడే తయారై వస్తాను." అంటూ లోపలికెళ్ళింది రేఖ.

దేవుడు వరాన్నో, అన్యోన్య దాంపత్యం కూడా ఒకటి. కాని, అందరు తృప్తిగాపొందలేరా వరాన్ని.

"హామ్మయ్య ! ఈయనున్నంత సేపు క్షణం తీరికుండదు. వెళ్ళిపోతే క్షణం తోచదు." అనుకుంది సురేఖ, రాఘవ్ ఆఫీసు వెళ్లాక.

అప్పుడే పోస్టుమన్ పత్రిక ఇచ్చాడు. విషయసూచిక చూసిన రేఖ "అబ్బ ! మరీ రెండే కథలున్నాయి" అనుకుంది. మొదటి కథ చదవడం మొదలు పెట్టింది. పది నిమిషాల్లో పూర్తిచేసింది. కథ బాగానచ్చింది సురేఖకు.

"రచయిత్రి బాగా రాసింది. పేరు కూడా ఎంత బాగుంది ! కథలో ఓ కోట్."

"మాతృత్వం సిద్ధి స్త్రీ జాతికి, ఆమె ఔన్నత్యానికి గర్వకారణం. "అమ్మా !" అని పిలిపించుకోవడం సృష్టిలో ఏ మహానాయకుని పదవి కంటే, ఏ సింహాసనాధిపత్యం కంటే, ఏ మహాకావ్య సృష్టికంటే, ఏ కళాఖండ నిర్మాణం కంటే, ఏ రససిద్ధికంటే గొప్పకాదు ? సృష్టిలో అతి మధురమైనది మాతృత్వం" అంటుంది రచయిత్రి.

"నిజంగా "అమ్మ" అనేది ఎంత తీయటి మాట. ఆ రెండు అక్షరాల్లో ఎన్నో మమతలు దాగున్నాయి. ఎవరీ అమ్మను సృష్టించినది అనురాగపు మూర్తిగా !...." ఆలోచిస్తోంది సురేఖ.

"అమ్మంటే అంతులేని సొమ్మురా" రేడియోలో పాట విన్పిస్తోంది.

"నిజం, ఇది ముమ్మాటికీ నిజం," అనుకుంది సురేఖ.

ఆలోచిస్తున్న సురేఖ మీద అనాలోచితంగానే గతంలోకి వెళ్ళింది.

* * *

"ఉహూ ! నాకివేం వద్దు. అమ్మ కావాలి" మారాం చేస్తూ అంది ఆరేళ్ళ సురేఖ.

"వస్తుందమ్మా ! ముందు అన్నం తినాలి. చూడు ! నీ కోసం ఎన్ని బొమ్మలు తెచ్చానో ! మా రేఖ బంగారం. ఇంకా ఏం కావాలో చెప్పమ్మా !" బుజ్జగిస్తున్నాడు సురేఖ నాన్న రంగనాథ్.

"ఈ బొమ్మలేం వద్దు. అమ్మ తినిపిస్తేనే అన్నం తింటాను. లేకపోతే నాకొద్దు. అమ్మా...." ఏడుపు స్థాయి పెంచుతోంది సురేఖ, తన మాట వినిపించుకోక.

అమ్మ చచ్చిపోయిందని, ఇంకెప్పుడూ తిరిగి రాదని, అసలు కన్పించదనీ ఎవరు బోధించగలరు ? ఏ విజ్ఞానం తెలియ చెప్పగలదు. ఆ చిన్నారి మనసుకు ? ఏ భాషలో చెబితే అర్థమౌతుంది ఆ పసిమనసుకు ?

పాప మాటలకు కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే, అర్ధాంగి కళ్ళలో మెదుల్తుంటే, ఎలా సముదాయించగలడు. ఆ తండ్రి ? ఎక్కడినుంచి తేగలడు రేఖకు అమ్మను ?

నాన్న మాట్లాడక పోవడంతో రేఖ ఏడుపు కాస్త స్థాయి పెంచింది.

"ఇలాగివ్వండి బాబూ ! అమ్మాయిగార్ని తోటలోకి తీసికెళ్ళి, అన్నం పెడతాను" అంది పని మనిషి రంగమ్మ. యజమాని దైన్యాన్ని గమనించి.

"ఊహూ ! నే రాను" అంది సురేఖ, నాన్నను గట్టిగా పట్టుకుంటూ.

"అమ్మాయిగారూ ! మిమ్మల్ని ఆలయానికి తీసికెళ్తాను. రండమ్మా ! అక్కడ, దేవుడికి దండం పెట్టుకుంటే మీ అమ్మ వెంటనే వచ్చేస్తుందండీ !"

"అయితే పోదాం పద !" అంటూ నాన్నారి దగ్గర్నుంచి రంగమ్మ దగ్గరికి వచ్చింది సురేఖ. పండ్లు, పువ్వులు తీసుకొని గుడికి బయల్దేరారు రంగమ్మ సురేఖలు.

వెనుక నుంచి వాళ్ళను చూస్తున్న రంగనాథ్, "దేవుడా ! నా భారతిని మాకు దూరం చేసి, చిట్టి సురేఖకు, నాకూ ఎన్ని కష్టాలు పెట్టావయ్యా ! అమ్మ కావాలని అలమటించే సురేఖను ఎన్నాళ్ళు మభ్య పెట్టగలను ! అనుక్షణం భారతిని తలచే నా మనసును ఎలా అదుపులో ఉంచుకో గలను ! ఎందుకు నాకీ శిక్ష?" అనుకున్నాడు.

బాధల్లో భగవంతుని తలవని మనిషి ఉంటాడా ?

రంగమ్మ ఏం చెప్పిందో గాని, ఇంటికొచ్చిన సురేఖ అమ్మంతిని నిద్రపోయింది.

"దేవుడు అమ్మను పంపిస్తాడనుకుంటోంది అమ్మాయిగారు. ! మళ్లీ పొద్దున లేచి ఏం గోల చేస్తుందో ?" అనుకుంది రంగమ్మ నిద్రపోతున్న సురేఖను చూచి.

*

మరో ఎనిమిదేళ్ళు దొర్లిపోయాయి కాలచక్రంలో. అమ్మ ఇక రాదనే కఠోర సత్యాన్ని అతి కష్టం మీద జీర్ణం చేసుకుంది సురేఖ. నిజమెంతటి కఠోరమైనప్పటికీ, వాస్తవాన్నంగీకరించక తప్పుతుందా ?

సురేఖ హైస్కూల్లో చదువుతోంది. సురేఖ నాన్నకు సాధారణంగా క్యాంపులు ఎక్కువ. ఎక్కువగా ఆఫీసు పనుల్లో మునిగి ఉంటారు. సురేఖతో గడిపే కాలం చాలా తక్కువ.

సురేఖ ఏ అడిగినా తెచ్చిస్తాడు రంగనాథ్. ఆయన సురేఖకు ఏ లోటూ రాకుండా చూడ్డానికి అధిక ప్రాముఖ్యం ఇస్తారు. ఇంట్లో పనంతా రంగమ్మ చేస్తుంది. కాని, సురేఖకు ఏదో వెలితి ప్రతి క్షణం కన్పిస్తుంది.

మనిషి ఆనందంగా బ్రతకడానికి ఆప్యాయత, అనురాగం కావాలి. అవే లోపించాయి సురేఖకు. అమ్మ లేని లోటు అనుక్షణం


వివాహ సంతానం లేదా ?



ఆపరేషన్ యితర వైద్యవిధానముల చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణులు, మా సలహా సంప్రదింపులచే. దేశములో పలు ప్రాంతముల స్త్రీలు సంతానవతులై పంపిన ప్రశంసాపత్రములు అనేకము గలవు.

ఉచిత సలహా. వివరములకు....

శ్రీ నాగార్జున మూలికా కుటీరం

రైల్వేస్టేషన్ వద్ద !! రామాలయం వీధి,

తెనాలి - 2.

# బుల్లి బుల్లి యిసిత్రాలు

బ్రోకి వోలంతా యింటిమీదడి
యిరగ బడ్డే
సుతి పోగొట్టేసుకోని
అప్పు పిచ్చోడ్నా
నాటకం ఆడేసినాడు
యీ పిచ్చినవట యింకేటి
కూడెడ్తాడని
ఆడు సూత్తావుండగానె
వోడికో కన్నుకొట్టిం దాడి పెల్లాం
అక్కడున్నోలంతా ఎల్లి పోనాక
గుబుక్కున దాని జుత్తట్టుకోని
యేటేసంజా అంటె
నిజం తెల్సుగోడానికట్టా
సేసా్నారే....
కూరలకే ఆపికే డబ్బులడిగితే
నువ్వాపిచ్చిలోనె కట్టుకొయ్యనా
నిల్సుండిపోతే
నానేటి సేసేది
మరి నువ్వు త్తినే దారికొత్తావేటి
అనీ పిరిక
ఆడు నవ్వగా నల్లారిపోయి
మరి యెవ్వ ఆడొచ్చేత్తె
యేటిసేత్తావె అన్నాడు పిచ్చోడు
అది దాంతాయినా గింజనవ్వులు నవ్వి
నీపిచ్చి కుదిరిందంటా లేరా
అంది నవ్వుని
వెయ్యింతకేనా గడ్డుముండ
గడ్డు ముండే నారే

అమ్మగోరింటికెల్లిన పెల్లాం
వొచ్చేత్తోందని
తల్సుకోని తల్సుకోని
బేడెట్టకుండ
గెడ్డం గీసేసుకో బోనాడు
నవ్వుకోని
బేడుబిగించి
గెడ్డంనింద నాట్లేసేసుకున్నాడు
అంతేనారే
నెనంలో కొత్త పెల్లాం
యెంత కొత్తగా నవ్వుద్దోఅని
యెంతగానో సిగ్గుతో సచ్చిపోనాడు
కుర్రగుంటడు

* * *

వోదేనాసలే...
పండంటె కుర్రదానికేనా
మామంచి పొరిటీకేనా
జానిసె పోవాలంట
యిదితెల్సి
అన్నమైతేయేటి
సున్నామైతేయేటి
అని బజనసేత్తూ
అంతా గుంటల మొలలకే గంటలై
పోనారు
అందుకేనోరే....
పొరిటీలన్నీ గోడల్నిండ
దేముడి పటాల్లా ఏలాడ్తున్నాయి!

* * *

— రంపి సోమరాజు

కలవరపరచేది సురేఖను. దానికి తోడు తోటి విద్యార్థులు "నీకు అమ్మ లేదని" వెక్కిరించేవారు.

"నేను పుట్టాకనే మా నాన్నకి ప్రమోషన్ వచ్చిందట. అందుకే మా నాన్నకు, అమ్మకు నేనంటే అందరికన్నా యిష్టం." అని గర్వంగా చెప్పుకునే సుజని.

"నా ప్రశ్నలు సరిపెట్టేది మా అమ్మే నోయ్. నా కసలు ప్రశ్నలే తెలియదు." అని మురిసిపోయే లత ....

"నేను ప్రతిరోజూ మాఅమ్మ ముఖమే చూస్తాను. నిద్రలేవగానే అని వాళ్ళమ్మపై తనకుగల ప్రేమనుచాటేది ఉమ. మా ఇంటికి వచ్చిన ఫ్రెండ్స్‌తో మా అమ్మ ఎంచక్కా మాట్లాడుతుంది." అని పొంగిపోయే ఉమ.

"నా కిప్పటికీ మా అమ్మే జడవెయ్యాలి" అనే ఫెంత్ క్లాస్ విద్యార్థిని సుమ ....

"మా అమ్మ పక్కలో తప్ప నా కింకెక్కడా నిద్రపట్టదు." అనే తొమ్మిదో తరగతి విద్యార్థిని మాధవి.

"నే త్వరగా ఇంటి కెళ్ళాలి. లేటయితే మా అమ్మ గాభరా పడుతుంది." అనే మంజుల ....

వీళ్ళందరి సమక్షంలో మూగబోతుంది సురేఖ మనోవీణ.

"వీళ్ళంతా నా గుండెనుకోసే బాకులు. నా బాధను పెంచే ప్రత్యర్థులు అనుకుంటుంది కసిగా కాని మరుక్షణం వీళ్ళంతా అదృష్టవంతులు. నేను జన్మలో పొందలేని అమ్మ అనురాగాన్ని పొందగలిగిన అమృతమూర్తులు" అనుకునేది సురేఖ.

ప్రతిమనిషికీ తెలుసు ఈజీవితంశాశ్వతం కాదని. అయినా, దీనికోసమే ప్రాకులాడుతారు మనుష లందరూ. ఈ దేశంలోని పేదలందరికీ తెలుసు - బీదరికం యిప్పట్లో పోదని. అయినా అరనిముషంలో పోతుందని భ్రమపడతారు. ప్రతి నిరుద్యోగికీ తెలుసు లంచం లేందే తానుద్యోగి కాలేడని. అయినా క్వాలిఫికేషన్స్‌తోనే ఉద్యోగం సంపాదించాలని చూస్తాడు. ఆంధ్రదేశంలోని అమ్మాయిలందరికీ తెలుసు కట్నమిచ్చుకోకుండా తాము శ్రీమతులంకాలేమని. ఐనా కలలుగంటారు. కట్నం లేకుండా తమ పెళ్ళి జరగాలని. నాయకులందరికీ తెలుసు దేశంలో కరువు తాండవిస్తోందని. అయినా, దేశం సుభిక్షమని బుకాయిస్తారు. సురేఖకూ తెలుసు అమ్మ లేదనీ, ఇక రావనీ. అయినా ప్రతి క్షణం అమ్మకై నిరీక్షిస్తుంది. ఆమె మనసు, చంద్రునికై నిరీక్షించే చకోరిలా, వర్షానికి ఎదురు చూసే చాతకిలా.

"కొంతమందికున్నట్లు, నాకు కనీసం సవితి తల్లయినా లేదు కదా!" అనుకునేది సురేఖ.

"ఎవర్నయినా సరే "అమ్మా!" అని పిలవాలని ఆరాటపడేది సురేఖ మనసు. కాని అది తీరని కోరికైంది సురేఖకు. అమ్మను సుస్పష్టంగా గుర్తు చేసి, ఆమె లోటును తెలియజేసే సంఘటనలు సురేఖ జీవితంలో కోకొల్లలు.

ఓ సారి....సురేఖ స్కూల్ ఫైనల్ చదువుతున్న రోజులవి. సురేఖ నాన్న క్యాంప్ కెళ్ళారు. పిక్‌నిక్‌కు వెళ్ళిరావడంతో సురేఖకు విపరీతమైన జ్వరం ముంచు కొచ్చింది. రంగమ్మ పొద్దునే పిల్లేనందున, కూతుర్ని పంపింది. చాలా ఎక్కువగా ఉంది టెంపరేచర్. రంగమ్మ కూతురు రామి ఎనిమిది గంటలకే హాయిగా గురకలు పెట్టి నిద్ర పోతోంది. సురేఖకు దాహం వేసింది. రామిని పిల్చినా దానికి మేలుకువరాలేదు. మంచి నీళ్ళు తాగాలని లేచిన సురేఖ కళ్ళు తిరిగి పడిపోయింది. పేపున రూమున వచ్చిన రంగమ్మ సురేఖకు సపర్యలు చేసే వరకు, అలాగే పడి ఉంది సురేఖ. "అమ్మే ఉంటే?" అని సురేఖ మెదడులో నిలిచిన ప్రశ్నకు సమాధానం ఎవరివ్వగలరు!

"అమ్మ లేనిలోటు మగ పిల్లలకంటే ఆడ పిల్లలకే ఎక్కువ." అనుకునేది సురేఖ తరచుగా. రోజులు గడుస్తున్నయ్.

సురేఖ స్కూల్ ఫైనల్ పాసయ్యింది. అంతటితో ఆమె చదువు ఆగిపోయింది. సురేఖ పెళ్ళికి ప్రయత్నాలు జరుపుతున్నారు రంగధామ్.

సురేఖ వయసుతో పాటు ఆలోచనలు కూడా మారిపోయాయి. చుట్టు ప్రక్కల పిల్లలందరూ ఎప్పుడూ సురేఖతోనే గడిపేవారు. వాళ్ళకు కథలు చెప్పి పాటలు నేర్పి, జడలు వేసి, ఎంతో ప్రేమగా చూసేది. పిల్లలందరు సురేఖను వదలకుండా 'అక్కా' అంటూ ఆమెతోనే రోజంతా గడిపేవారు. ఆ తరుణంలోనే అమ్మను గురించిన ఆలోచనలు ఇంకో మలుపు తిరిగాయి.

"నాకూ పెళ్ళవుతుంది. పిల్లలు నన్ను

(మిగతా 29 వ పేజీలో)

# అమ్మ

[12వ పేజీ తరువాయి]

'అమ్మా!' అని పిలుస్తారు. ఎంత తీయని ఊహ! అనుకునేది ఆనందంగా సురేఖ. కాని, అంతలో ఓ సందేహం భూతంలా భయపెట్టేది.

"ఒకవేళ నేను కూడా అమ్మలాగా చనిపోతే, నా పిల్లలు కూడా నాలాగా మమతకు, ఆప్యాయతకు దూరమై అనుక్షణం ఆదరణ కోసం అంగలారుస్తూ, తమను వదలి వెళ్ళినందుకు కుమిలిపోతూ, అశాంతిగా బ్రతుకు గడుపుతారేమో!"

"అలాగైతే, పెళ్ళిచేసుకో కూడదు" అని నిర్ణయించుకొనేది కొన్నిసార్లు. కాని, అంతలోనే.

"నేను నా పిల్లలకు అమ్మ ఇవ్వగలిగిన ఆదరణను, ఆనందాన్ని, ఆప్యాయతను ఆసాంతం ఇస్తాను. వాళ్ళని ఎప్పుడూ విడిచి పెట్టను. వాళ్ళతోనే ఉండిపోతాను. నా పిల్లలు ఒక్క నాటికీ నాలా కారు."

అని తనకు తనే ధైర్యం చెప్పుకొనేది సురేఖ.

అనుకున్న విధంగానే సురేఖ పెళ్ళి, రాఘవ్‌తో జరిగింది ఓ సుముహూర్తాన. రాఘవ్ సరళస్వభావుడు స్నేహశీలి. ప్రేమమూర్తి అతనితో సాఫీగా, తృప్తిగా గడిచిపోతుంది సురేఖ జీవితం. ఎడారిలోని బాటసారికి మధుర పానీయాలు లభ్యమైనట్లు అనురాగపు దప్పిగొన్న సురేఖకు భర్త ప్రేమ ఎనలేని సంతృప్తి నిచ్చింది. సురేఖ జీవితంలో భర్తతో గడిపిన ఆరోజులే తీయనివి. మాయనివి!

సురేఖ పెళ్ళయి, మూడేళ్ళవుతోంది. ఇంతవరకు సంతానం కలుగకపోవడం, ఆమె కెంతో విచారాన్ని కలిగించేది. తను అమ్మ కావాలనే కోర్కె సురేఖ మనసులో నాటుకొని, పెరిగె పెద్దదై, మహా వృక్షంగా మారింది. సురేఖ మనసు తను అమ్మ కావాలని తపించింది. దేవుణ్ణి ప్రార్థించింది. ఆ దేవుడే కరుణించాడేమో! ఇన్నాళ్ళకు ఆమె కోరిక తీరబోతోంది. సురేఖ ఎప్పుడూ తనకు పుట్టబోయే బిడ్డను గురించే ఆలోచించేది. తను అమ్మ కాబోతుందన్న ఊహ ఆమెకు ఎంతో ఆనందాన్నిచ్చేది.

• •

"ఏమిటివాళ రాణిగారు దీర్ఘాలోచనలో పడ్డారు? అంత ఆలోచన ఆరోగ్యానికి మంచిది కాదు." ఆఫీసు నుంచి వచ్చిన రాఘవ్ అన్నమాటలకు సురేఖ ఆలోచనా స్రవంతి ఆగిపోయింది.

"ఓహో! చాలా లేటైపోయిందా!" అనుకుంటూ భర్త వెనకాలే లోనికెళ్ళింది.

• •

అది రాత్రి.

చీకటితో నిండిన అర్ధరాత్రి.

అప్పుడు సమయం పన్నెండవుతోంది.

అప్పుడే హాస్పిటల్ వాతావరణం సద్దుమణుగుతోంది అలజడి చెందిన మనసు మత్తులో మునిగిపోతున్నట్లు దేశం వైద్య రంగంలోనూ వెనకబడిందన్నట్లు, ఎందరో రోగులు సరైన ట్రీట్‌మెంట్ లేక బాధపడుతున్నారు. దేశంలో పెరిగిన జనాభాలా, రోగుల సంఖ్య కూడా పెరిగినట్టు హాస్పిటల్ నిండా కిటకిటలాడుతున్నారు రోగులు. చీకటికి అంతా కన్పించడం లేదు. దేశంలోని దారిద్ర్యంలా వాతావరణం భయాన్ని కలిగిస్తోంది. ప్రజాస్వామ్య ప్రభుత్వంలా.

రాఘవ్ అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఆపరేషన్ రూమ్ ముందు ఆతృత, ఆందోళన అతని ముఖంలో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. అతని శరీరం రూమ్ వెలుపలే ఉన్నా, మనసుమాత్రం, లోపలున్న సురేఖ చుట్టూ తిరుగుతోంది.

"రేఖ కెలా ఉందో!" సుమారు పదోసారి అనుకున్నాడు. ఇదే మాటను మనసులో, క్షణమొక యుగంగా గడుస్తోందతనికి. మనసులోనే వెయ్యి మంది దేవుళ్ళకు మొక్కుకున్నాడు.

"నా రేఖను క్షేమంగా ఉంచ"మని.

ఆపరేషన్ రూమ్ తలుపులు తెరుస్తున్న చప్పుడైంది. ఆత్రతగా తలెత్తి చూశాడు రాఘవ్. బయటి కొస్తున్న డాక్టర్ కన్పించాడతనికి. అప్పుడా డాక్టరే దేవుడిలా అగుపించాడు. రాఘవ్ కళ్ళకు.

డాక్టర్! నా మిసెస్ కెలా ఉంది?" ఆ ఒక్క ప్రశ్నలోనే తన ఆతృతనంతా ఇమిడ్చాడు.

"సారీ మిస్టర్ రాఘవ్! వెరిసారీ! ఆమెను అతికష్టం మీద బ్రతికించ గలిగాము పుట్టిన బాబు చనిపోయాడు. మేజర్ ఆపరేషన్ చేశాము.

డాక్టర్ మాటల కడ్డొస్తూ.

"నా రేఖకేమీ ప్రమాదం లేదుకదా డాక్టర్!" అడిగాడు రాఘవ్.

"గండం గడిచినట్లే. అ! అన్నట్లు ఆమె ఇక తల్లి కాలేదు. నే వెళ్ళొస్తా!" తన పని నెరవేర్చిన కర్తవ్యనిర్వాహకుడిలా వెళ్ళి పోయాడు డాక్టర్.

డాక్టర్ మాటలకు అప్రతిభుడై పోయిన రాఘవ్. అయిదు నిమిషాల దాకా తేరుకోలేక పోయాడు, ఆషాక్ నుండి. ఏవోభావనా వీచికలు కుదిలాయతని హృదయంలో.

"నా రేఖకు తల్లి లేదు. అమ్మకోసం, ఆమె మమత కోసం, రేఖ హృదయం అర్రులు చాచింది. కాని ఆ ప్రేమను పొందలేకపోయింది, కనీసం తనైనా అమ్మ కావాలనుకుంది. ఆశ పడింది. కాదు. కాదు.... అది ఆశ కానే కాదు. అతి సహజమైన స్త్రీ కోరిక. కాని, ఆ విషయంలోనూ దారుణంగా వంచించింది విధి ఆమెను. ఎందుకామె కింత శిక్ష? అని ఎవర్నడగాలి? 'అమ్మా!' అన్పించుకొనే యోగం ఇక తనకు లేదని తెలిస్తే ఆ విషయాన్నామె తట్టుకోగలదా? భగవాన్! ఈ కఠోర సత్యాన్ని ఎదుర్కొనే శక్తి నా రేఖకు ప్రసాదించు తండ్రీ!" చేతులు జోడించాడు రాఘవ్. మనసులో ఆవేదనలు రేగుతుండగా.

లోపల. బెడ్‌పైన ప్రశాంతంగా పడుకుంది, సురేఖ. ఆమె వదనంలో ఒక విధమైన తృప్తి, సంతోషం లీలగా గోచరిస్తున్నాయి.

•

ఏ మనిషైనా ఒక కష్టాన్ని, ఒక విఘాతాన్ని తట్టుకోగలడు. అదెంతటి కఠినమైన నిజమైనా. కాని, ఒక దాని వెంట ఒకటిగా ఎదురయ్యే బాధలు భరించడం సురేఖకు సాధ్యమా?

★

# వేదన

— జి. వెంకటేశులు

దేవుడు మిమ్మల్ని సృష్టించాడు
ఆ దేవుడే నన్నూ సృష్టించాడు
భగవంతుడు ఎవరికీ అగుపించడు
అందుకని-నాకు మీరుకనిపించరు!

మంత్రులు ఉపన్యాసాలిస్తున్నారు
నేను ఉపవాసాలు చేస్తున్నాను
మీరు ఉదాసీనంగా చూస్తున్నారు
మానవత్వాన్ని ఖూని చేస్తున్నారు!

ఆయువు తరుగుతుంది
ధర్మం విరుగుతుంది!

ఓట్లు, నోట్లు, లోట్లు పెరుగుతున్నాయి
డబ్బున్న మారాజుల అక్రమాలు
మబ్బుల దారుల్లో ఆకాశానికి
అడుగుతున్నాయి!

విషం కొనడానికి ఒక్క రూపాయి
తక్కువైంది
బ్రతకడానికి ఎలాగు పైసా దానం
చెయ్యరు
చావడానికైనా ఒక్క రూపాయి దానం
చెయ్యండి!